క్లుప్తంగా

మొక్కజొన్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బల్లికురవ: మొక్కజొన్న సాగుచేసిన రైతులు పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు ఈ నెల 13వ తేదీలోపు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని, నాణ్యతా ప్రమాణాలున్న పంటలు మాత్రమే కొనుగోలు చేస్తారని చెప్పారు.

మిరప తోటల పరిశీలన

బల్లికురవ: మండలంలోని సోమవరప్పాడు, ఉప్పుమాగులూరు, వేమవరం, గంగపాలెం, కొప్పరపాలెం గ్రామాల్లో మిరప తోటలను గురువారం మార్టూరు ఉద్యానవన శాఖాధికారి బీ హనుమంతనాయక్ పరిశీలించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

అధిక వర్షాలతో జాగ్రత్త

అద్దంకి: అద్దంకి వ్యవసాయ డివిజన్ పరిధిలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు అధికంగా వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మార్టూరు ఉద్యానవనశాఖ అధికారి నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతమాగులూరు, బల్లికురవ, యద్దనపూడి, మార్టూరు తదితర మండలాల రైతులు కోసి ఆరబోసిన మిరపకాయలను పరదాలతో కప్పి జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. ఎండబెట్టిన మిరపకాయలను సురక్షిత ప్రదేశాల్లో జాగ్రత్త చేసుకోవాలని తెలిపారు. వర్షాలు తగ్గిన తరువాత మేంకోజబ్‌తో బావిస్టిన్ కలిసిన మందు 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. ఈ విధంగా చేసుకోవడం వల్ల తొల్లకాయలు రాకుండా చూసుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ సూచనలు పాటించాలని కోరారు.

కొలుపులకు నేడు అంకురార్పణ

బల్లికురవ: బల్లికురవ గ్రామంలోని పోలేరమ్మ కొలుపులకు శుక్రవారం అంకురార్పణ చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 5 రోజుల పాటు గటంకుంటతో ఇంటింటా గ్రామోత్సవం, అమ్మవారికి చద్ది సమర్పణ జరుగుతాయన్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు కొలుపులు, ప్రత్యేక పూజలు, అలంకరణ, అనంతరం అన్నదానం జరుగుతాయన్నారు. గ్రామస్తులంతా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

జే పంగులూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో కృష్ణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 2 అంగన్‌వాడీ టీచర్, 11 ఆయా పోస్టులకు ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని జాగర్లమూడివారిపాలెం జనరల్ కేటగిరిలో 1, రామకూరులో జనరల్ కేటగిరిలో 1 చొప్పున అంగన్‌వాడీ టీచర్ పోస్టులు ఉన్నాయని, దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆయా పోస్టులకు సంబంధించి జనకవరం 1 (జనరల్), అలవలపాడులో రెండు పోస్టులకుగానూ 1 బీసీఈ, 1 జనరల్, బూదవాడలో 1 (జనరల్), టీ తక్కెళ్లపాడులో 1 (జనరల్), భగవాన్‌రాజుపాలెంలో 1 (జనరల్), జాగర్లమూడివారిపాలెంలో 1 (జనరల్), కశ్యాపురం 1 (జనరల్), కొండమూరు 2 పోస్టులు (జనరల్), ఆరికట్లవారిపాలెం 1 (ఎస్సీ) చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తులను కొరిశపాడులోని సీడీపీవో కార్యాలయంలో అందించాలని తెలిపారు.

వేటపాలెం: వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వేటపాలెం, చీరాల రూరల్, చీరాల మున్సిపాలిటీ పరిధిలోగల మండలాల్లోని అంగన్‌వాడీ ఆయా పోస్టుల ఖాళీలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో ఉమ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలం పరిధిలో పందిళ్లపల్లి-5, ఆమోదగిరిపట్నం-1, ఐటీఐ కాలనీ, వివేకానందనగర్, చీరాల రూరల్ పరిధిలో జాండ్రపేట-7, గవినివారిపాలెం-2, పచ్చమోగలి, చీరాల మున్సిపాలిటీ పరిధిలో హైయ్యర్‌పేట, అరిటాకులనగర్ లోగల రిజర్వేషన్ కేటగిరి ననుసరించి ఖాళీలును భర్తీ చేస్తారని తెలిపారు.

పైపులైన్ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్

చీరాల: చీరాల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో 110ఎంఎం, 160 ఎంఎం హెచ్‌డీపీఈ పైపులైన్ ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. స్థానిక 6వ వార్డులోని కార్యంపూడివారి వీధిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పైప్‌లైన్ నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘ నిధులు క్రింద రూ.86 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అనుకోని కష్టం



పోతినవారిపాలెంలో మిరపపై పట్టలు కప్పుకున్న రైతులు



వర్షం వెలిసిన తరువాత ఎండ బెట్టుకుంటున్న రైతులు

- తగు జాగ్రత్తలతో పంటలు పదిలం
- ఆందోళన వద్దంటున్న వ్యవసాయాధికారులు

కారంచేడు: నోటికాడి కూడు ప్రకృతి గద్దలా తన్నుకు పోయింది. ఆరుగాలం కష్టించి రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంట కళ్లెదుటే తడిసిపోతుంటే ఆబాధ వర్ణనాతీతం. ప్రకృతి చూపించిన కోపానికి ఎవరికి చెప్పులేక కన్నీళ్లు పెట్టడం తప్ప ఏం చేయలేక పోయారు రైతులు. ఈ ఏడాది బాపట్ల జిల్లాలో సాగు చేసిన అన్ని రకాల పంటలు వాతావరణం అనుకూలత, మంచి వర్షాలు, సాగునీటి వసతులు అన్నీ కలసి వచ్చాయి. దీంతో రైతన్నలు ఊహించిన దానికంటే ఎక్కువగానే దిగుబడులు వస్తున్నాయి. గత కొన్నేళ్లగా అన్నదాతల దైనందిన జీవితాన్ని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులు కష్టపడి పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధరలు కల్పించింది. దీంతో ఎంతో ఉత్సాహంగా ఉన్న అన్నదాతలు, రైతన్నలకు అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటల చేలల్లో ఉండగానే ఈ అకాల వర్షాల తాకిడికి వాటిని కాపాడుకోడవడానికి నానా అవస్థలు పడుతున్నారు. కల్లాల మీద ఉన్న మిరప, దండేల మీద ఉన్న పొగాకు పంటలు నేడు అకాల వర్షాల తాకిడికి నష్టపోయే ప్రమాదముందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో ప్రస్తుతం వరి, మినుము, మొక్కజొన్న, శనగ వంటి ప్రధాన పంటలు మొత్తం సాగు పూర్తి చేసుకున్నాయి. ప్రస్తుతం మిరపతో పాటు, కొంత శాతం పొగాగు పంట దండేలా మీద ఉన్నట్లు రైతులు చెప్పున్నారు. ఈ పొగాకు కూడా వర్షాలకు నీరుగారి మడ్డికారిపోయి, ధరలు పతనమైపోతాయని రైతులు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే పంటలను కాపాడుకోవచ్చని వ్యసాయాధికారి కే శివనాగప్రసాద్ తెలిపారు.

మిరప సాగు వివరాలు..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో సుమారు)
పర్చూరు	15245
కారంచేడు	8775
ఇంకొల్లు	12560
యద్దనపూడి	8420
మార్టూరు	5265
చినగంజాం	174

మిరప రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పొలంలో ఉన్న నీటిని వెంటనే తీసివేయాలి. కొట్టుకొని వచ్చిన మట్టిని, ఇసుకను కూడా తీసివేయాలి.
- ఒరిగిపోయి ఉన్న మొక్కలను యథాస్థితికి తెచ్చి, మొదళ్లకు మట్టి ఎగదోయాలి.
- తగినంత ఆకులు ఉన్నట్లయితే 2 శాతం యూరియా, పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు, లీటరు నీటిని వారంలో రెండు సాగు పిచికారీ చేయాలి.
- మొక్కలు వడలిపోయి ఉంటే మెగ్నీషియం సల్ఫేట్‌ను 5 గ్రాములు లీటరు నీటిలో కలపి పిచికారీ చేసుకోవాలి.
- ఇనుము లోపం గమనిస్తే (ఆకులు తెల్లగా పాలిపోవడం) ఫెర్రస్ సల్ఫేట్ 5 గ్రాములతో పాటు ఒక గ్రాము సిట్రిక్ యాసిడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- నీరు పోయి కొంత సాధారణ పరిస్థితులు నెలకొన్న తరువాత గొర్రుతో గాని గుంటకలతో గాని దున్ని 30 కేజీల యూరియా, 15 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 200 కేజీల వేప పిండిని వేసుకోవాలి.
- మొక్కలు ఎదుగుదల లోపిస్తే సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాల్సి ఉంది.
- కాయకుళ్లు నివారణకు ప్రోపికొనజోల్ 1మిల్లీ, డైఫెనకొనజోల్, 1 మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- కాయతొలుచు పురుగు నివారణకు స్పైనోశాడ్ 0.3 మిల్లీ లీటరు, నొవాల్యురాన్‌ను 0.75 మిల్లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పూర్తిగా దెబ్బతిన్న పంటలుంటే కొత్తగా పంటలు వేసుకోవడం మంచిది.

జాగ్రత్తలు పాటిస్తే నష్టనివారణ తగ్గించవచ్చు..



ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందొద్దు. పంటలను రక్షించుకోవడానికి ముందస్తుగా పట్టలు సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు, వర్షాలు కురిసే సమయంలో వాటిని కప్పుకోవాలి. కొద్ది సేపు కురిసి మరలా మేఘాలు తేలిపోతున్నాయి. కాబట్టి నీరు నిలబడి పంటలు మునిగిపోయేంత వర్షాలు లేకపోవడంతో కొద్దిపాటి జాగ్రత్తలతోనే పంటలను కాపాడుకోవచ్చు.

కే శివనాగప్రసాద్, ఏవో, కారంచేడు

పథకాలతోనే ఆర్థికంగా నిలబడ్డాం



కోటపాడులో లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న కృష్ణచైతన్య

జే పంగులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే తాము అర్థికంగా నిలదొక్కుకున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గురువారం మూడో రోజు ఏపీ శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. 120 కుటుంబాలను కృష్ణచైతన్య కలిశారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలకుపైగా లబ్ధిచేకూరిందని, ఆర్థికంగా ఎంతో వెసులుబాటు లభించిందని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఈ పథకాలన్నీ అమలు చేయాలని ఆకాంక్షించారు. పథకాల నగదును నేరుగా బ్యాంక్ ఖాతాలలో జమచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్తూ వారిని ఆప్యాయంగా పలకరిస్తూ కృష్ణచైతన్య ముందుకు సాగారు. గ్రామస్తుల ఇబ్బందులు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారమార్గం చూపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకటసుబ్బారావు, మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రం గోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.గురువారం కృష్ణచైతన్య కోటపాడులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, సర్పచ్ రాములు, నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఆదిదేవుడి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

యద్దనపూడి: మండలంలోని పూనూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రిపుర సుందరి సమేత త్రిపురాంతక స్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అర్చకులు మూలంరాజ్ రాజ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ధ్వజారోహణం, సంప్రోక్షణ పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌లకు సుప్రభాత సేవలు, పంచామృతాభిషేకాలు నిర్వహించి మూలవిరాట్‌లకు సువర్ణ, రత్న, నాగాభరణ అలంకారాలు, విశేష పూజలు చేశారు. సాయత్రం 5 గంటలకు స్వామివార్ల కల్యాణ రాయబారం నిర్వహించి రాత్రి 7గంటలకు ఉత్సవ మూర్తులను పసిడి, రజిత ఆభరణాలతో, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ముమ్మారు గర్భగుడి ప్రదక్షిణ అనంతరం 8 గంటలకు నంది వాహనంపై కొలువై ఉండగా అర్చకులు స్వామివారి ఉత్సవరులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ప్రతిష్టించారు. కల్యాణ క్రతువును, శైవాగమ ప్రతిష్టాచార్యులు నాదెండ్ల విశ్వేశ్వరశర్మ, రామేశ్వర్ గురుకుల్ ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలు దరువూరి వీరయ్య దంపతులు స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు, కల్యాణ వస్త్రాలు సమర్పించారు.

మొక్కులు తీర్చుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



ఆంజనేయుడి పూజల్లో పాల్గొన్న బూచేపల్లి కుటుంబం

బల్లికురవ: ప్రజలంతా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రార్థించారు. గురువారం మండలంలోని వెలమవారిపాలెం సమీపంలోని ఆంజనేయుడిని దర్శించుకుని ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి, కోడలు నందిని, కుటుంబ సభ్యులతో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ ఆలయానికి రాగా, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



మురుగు కాల్వలను పరిస్థితులను పరిశీలిస్తున్న ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృష్ణమోహన్

మార్టూరు: ప్రజలు, ప్రయాణికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రం మార్టూరులో ఆమంచి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడారు. దీర్ఘకాలంగా హైవే అధికారుల నిర్లక్ష్యంతో మురుగు కాలువ సమస్య పరిష్కారం కాక జాతీయ రహదారికి ఇరువైపులా వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆమంచి దృష్టికి తీసుకెళ్లారు. రహదారికి తూర్పు వైపున స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో వర్షపు నీరు నిలచి, అధ్వానంగా ఉన్న మురుగునీటి పారుదలను పరిశీలించి తక్షణమే హైవే అధికారులు, పంచాయితీ రాజ్, ఆర్అండ్‌బీ, ఇంజినీరింగ్ అధికారులతో ఆమంచి మాట్లాడారు. అనంతరం స్థానిక విద్యా నగర్ చివరన అసిస్ట్ కాలనీ, మద్ది సీతాదేవి కాలనీల మధ్యన ఉన్న మురుగునీటి పారుదల సక్రమంగా లేని విషయాన్ని ఆమంచి దృష్టికి కాలనీ వాసులు తీసుకురాగా ఆయన కాలనీలను కూడా పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా పీఆర్, ఇతర సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలీ, కాకోలు రామారావు, భూక్యా రాజానాయక్, గర్నెపూడి రవిచంద్, గడ్డం మస్తాన్‌వలీ, సులేమోన్, భూక్యా బాబూనాయక్, కాకోలు వెంకటేశ్వర్లు, రఫీ, కొండమస్తాన్, కరీముల్లా స్థానికులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై తిరుమలరావు

జే పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామంలో రేణింగవరం ఎస్సై తిరుమలరావు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో యువత ఈజీమనీకి అలవాటు పడి అనేక కోణాల్లో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఫిజికల్ నేరాలు తగ్గిపోయాయని, సైబర్ నేరాలే ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. అందువలన సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైభవంగా నరసింహస్వామి జయంతి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అద్దంకి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ నరసింహస్వామి క్షేత్రంలో గురువారం స్వామివారి జయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారికి స్థాపన, విశేషాలంకరణ, లక్ష మల్లెలతో అర్చన, కల్యాణం నిర్వహించారు. బాలబాలికలచే కోలాటం ప్రదర్శించారు. ఆలయ ఈవో కోటిరెడ్డి మాట్లాడుతూ గురు, శుక్రవారాల్లో దేవస్థానంలో ఏకాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థాన ఈవో, ఆలయ ధర్మకర్త ఎస్.ఏడుకొండలు పర్యవేక్షించారు.

నేడు కోలలపూడిలో గడప గడపకు..

మార్టూరు: మండలంలోని కోలలపూడిలో శుక్రవారం గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వహించనున్నట్లు గురువారం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ హాజరవుతారన్నారు. మండల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

నేడు చినగంజాం రానున్న జిల్లా ఎస్పీ

చినగంజాం: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ 5వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చినగంజాం పోలీస్ స్టేషన్‌కు రానున్నట్లు ఎస్సై కే సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆయన పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు, సిబ్బది పనితీరు తదితర అంశాలను పరిశీలన చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై నడిచి వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టిన ఘటన గురువారం రాత్రి మార్టూరులో జరిగింది. 108 సిబ్బంది నాగేశ్వరమ్మ వివరాల మేరకు.. మార్టూరుకు చెందిన షేక్ చిన్న చందు సాహెబ్ స్థానిక కూరగాయల మార్కెట్ నుంచి జాతీయ రహదారి దాటి అవతలి వైపుకు వెళ్లే ప్రయత్నం చేయగా ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వేగంగా వెళ్లే కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో రోడ్డుపై పడి తలపగిలి తీవ్రంగా గాయపడిన చిన్న చందు సాహెబ్‌ను 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

అద్దంకి రూరల్: మండలంలోని కొటికలపూడి, తిమ్మారెడ్డిపాలెం గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. మండలంలోని కొత్తకొటికలపూడి గ్రామానికి చెందిన తిప్పాబత్తిన రామాంజనేయులు గ్రామం నుంచి బైకుపై కొటికలపూడి వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

ప్రముఖ వైద్యుడు పున్నయ్య చౌదరి మృతి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు మోపర్తి పున్నయ్య చౌదరి (88) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. మేదరమెట్ల గ్రామంలో 1968లో వైద్యశాల ఏర్పాటు చేసి ఇప్పటి వరకు రోగులకు వైద్యసేవలు అందించారు. చుట్టుపక్కల గ్రామాల్లో చక్కని హస్తవాసి గల పేదల డాక్టర్‌గా గుర్తింపు పొందారు. గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఆయన.. కొంతకాలం ఒంగోలులోని ప్రముఖ వైద్యుడు బీఎల్ నారాయణ వద్ద ప్రాక్టీసు చేసిన అనంతరం మద్దిపాడు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్‌గా పనిచేశారు. అనంతరం 1968లో శ్రీనివాస నర్సింగ్ హోం పేరుతో మేదరమెట్లలో వైద్యశాల ప్రారంభించి సమీప గ్రామాల ప్రజలకు ఎనలేని వైద్యసేవలు అందించారు. బుధవారం రాత్రి కూడా వైద్యశాలలో రోగులకు వైద్యసేవలందించారు. తెల్లవారేసరికి మృతిచెందారు. సమీప గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు

సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

కారంచేడు: గ్రామ సచివాలయాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే శాఖా పరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో డీ విజయలక్ష్మి హెచ్చరించారు. గురువారం ఆమె మండలంలోని తిమిడెదపాడు గ్రామ సచివాలయంను తనిఖీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి అన్ని శాఖల సిబ్బంది కృషి చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో ఉన్న గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకేలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులు దేవుడి స్వరూపులు

చీరాల రూరల్: చిన్నారులు దేవుడి స్వరూపులని వారికి చిన్ననాటి నుంచి చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన కూడా అలవరచాలని రెవరెండ్ కొమ్మిన జోసఫ్ కేరి, రెవరెండ్ పిల్లి దేవదాసులు పేర్కొన్నారు. వేసవి విరామ బైబిల్ శిక్షణ తరగతులను చీరాల పట్టణంలోని చర్చిలలో ఎంతో ఘనంగా ప్రారంభించారు. గురువారం స్థానిక చర్చికాంపౌంలోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో వేసవి విరామ బైబిల్ శిక్షణా తరగుతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సండేస్కూల్ టీచర్లతో ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో బైబిల్ గ్రంథంలోని పలు అంశాలపై గురించి వివరించారు. కార్యక్రమంలో చర్చి చైర్మన్ దేట అశోక్‌కుమార్, ట్రెజరర్ యెరిచర్ల రమేష్ బాబు పాల్గొన్నారు. మూడు రోజులు క్రితం రామానగర్‌లోని జీసస్ వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ నోవా ఆర్. అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ ఫెస్టివల్ పేరుతో వేసవి విరామ బైబిల్ శిక్షణా తరగతులను ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సూర్యనారాయణ

చినగంజాం: ప్రజలు పోలీసులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని వంకాయలపాడు గ్రామంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని ప్రజలను సమావేశ పరచి పోలీసులు చట్టాలు, సైబర్ నేరాలు, దిశ యాప్ గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు మోసాలకు గురికావద్దని, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్, పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల



వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన భారీ ఎలక్ట్రిక్‌ప్రభ

అద్దంకి రూరల్: మండలంలోని మైలవరం గ్రామంలోని ప్రసన్నాంజనేయ స్వామి 26వ వార్షిక తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. రాత్రికి వైఎస్సార్ సీపీ నాయకడు మన్నేపల్లి అంకమ్మరావు యూత్ ఆధ్వర్యంలో రాత్రికి భారీ ఎలక్ట్రిక్ ప్రభను ఏర్పాటు చేశారు. ప్రభపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు: మండల కేంద్రమైన మార్టూరులో పర్చూరు ఎస్ఈబీ అధికారులు బుధవారం అర్ధరాత్రి అక్రమంగా నిల్వ ఉంచిన 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శివరామప్రసాద్ వివరాల మేరకు.. స్థానిక కొణిక రోడ్డులో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్న తన్నీరు బాబుకు చెందిన దుకాణంలో అధికారులకు అందిన సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. కూలింగ్ వాటర్ క్యాన్‌లో దాచి ఉంచిన 37 మద్యం క్వార్టర్ బాటిళ్లు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకొని, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.